కథా నిలయం
3777
శ్రీకాకుళం

# హింస సందేశం

రాత్రి సెకండ్ షో సినిమా చూసి మా మిత్రుడు టాంకుబండ్ పై నుంచి స్కూటర్ మీద రివ్వున పోతున్నాడు ఒంటిగంటన్నర దాటింది. చీకట్లో విద్యుచ్ఛక్తి దీపాలు మిలమిల మెరుస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ లో కలకల ధ్వనులు, గందరగోళం వినిపించింది. ఏవో దెయ్యాలూ భూతాలూ కొట్టుకుంటున్నట్లు అచోద్యం చూసి ఆగాడు. సాగర్ మధ్యలో బుద్ధ విగ్రహం నుంచి 'అహింసో పరమో ధర్మః' అనే శబ్దాలు వినిపించాయి. తీరా చూస్తే ఆ బుద్ధ విగ్రహం నుంచే వినిపిస్తున్నాయి ఆ శబ్దాలు.

'డౌన్ డౌన్ బుద్ధా!!' 'డౌన్ డౌన్' అంటూ చుట్టూ నిరసన ధ్వనులు, కేకలు, బంగ్లాదేశ్ పార్లమెంటులా నానా గొడవలూ.

'నువ్వు ఆ సందేశం యివ్వడానికి వీలులేదు' అంది ఓ భూతం. త్రాచుపాములా, తెల్లగా వెలుగుతోంది చీకట్లో.

'అయ్యా' అహింస కోసం ఉదయించిన భగవానుణ్ణి నేను' అన్నాడు బుద్ధుడు.

'చాల్లేవయ్యా' ఎక్కడ అహింస వుంది నీ చుట్టూ - చెప్పు 'అని నిలదీసింది మరో భూతం -నీ చరిత్ర గురించి తెలుసుకో' అంది రెట్టించి.

'నేను మహారాజు వంశంలో పుట్టాను' అన్నాడు బుద్ధుడు.

'హోహో' నువ్వొక రాయివి - ఓ పెద్ద బండరాయివి అనేక వందల శిల్పులు సుత్తితో కొట్టగా కొట్టగా యిలా తయారయ్యావు!!

రాయిలో కూడా ప్రాణముందని కృష్ణ భగవానుడు చెప్పలేదూ!

ప్రాణమున్న రాయిని నానా హింసలు పెట్టగా నువ్విలా తయారయ్యావు' అన్నాడు ఓ తొండంలేని వినాయకుడు.

'నేను సన్యాసినై ప్రపంచాన్ని దర్శించాను - అన్వేషించాను' అన్నాడు బుద్ధుడు.

ఓ భూతం పకపక నవ్వింది

'ఏమయ్యా నిన్ను లారీల్లో హైదరాబాద్ తేవడానికి ఎంతమంది ఇంజనీర్లు బాధపడ్డారో తెలుసా! ఎంతమందికి నడుం విరిగి, ఏడ్చారో తెలుసా! ఇంతమందిని నువ్వు హింస పెట్టడం బాగుందా! - అని తాచు పాము బుస్సుమని బుద్ధుడి పైకి లేచింది.

'ప్రపంచంలోకెల్లా పెద్ద విగ్రహానిగా నేను నిలబడ్డాను. బుద్ధుడిగా మారాక ఆ రోజు నా తండ్రి ముందు నాకు పంచభూతాలపై ఉన్న అధికారం - ప్రభంజన రూపంలో - చూపించాను - అన్ని శక్తులు ఉన్నా నేను అహింసావాదినే' అన్నాడు బుద్ధుడు.

'ఏమి అహింస బ్రదరూ! నిన్ను హుస్సేన్‌సాగర్‌లో నిలబెట్టాలని తెచ్చిన కార్మికులను ఎంతమందిని చంపావ్!' అందులో నేనొకడిని - అన్నాడు ఓ కార్మిక నాయకుడి భూతం.

'అయ్యా నేను బోధివృక్షం క్రింద తపస్సు చేసి శాంతి అహింసల జ్ఞానం పొందాను' అన్నాడు బుద్ధుడు వినమ్రంగా.

'నీ బోధి వృక్షం మేమెవ్వరం చూడలేదు. ఇప్పుడు నువ్వు ఉన్నది హుస్సేన్‌సాగర్ మధ్యలో - ఇక్కడ ఎంత మంది ఆత్మహత్యలు చేసుకున్నారో తెలుసా. ఎన్ని బస్సులు, కార్లు ఇందులోకి దొర్లుకుపోగా ఇదో రక్తపు మడుగు అయింది తెలుసా!' అన్నాడు చచ్చిపోయిన ఓ బస్సు కండక్టరు.

'నా అహింసా సందేశం విని ఎంతమంది ఆడవాళ్ళకు మనశ్శాంతి

కలిగిందో! - మీకేమి తెలుసు! అన్నాడు బుద్ధుడు గర్వంగా.

ఓ ఆడ దెయ్యం హూంకరిస్తూ లేచింది. 'ఏం మాట్లాడుతున్నా వయ్యా! ఈ హుస్సేన్‌సాగరులో చచ్చినవాళ్ళు - ఆత్మహత్య చేసుకుని రక్తపాతాలు చేసిన వాళ్ళు - చాలామంది ఆడవాళ్ళే! ఈ దేశంలో వాళ్ళకు శాంతి ఎక్కడయ్యా! నీ అహింసా సందేశం మాకేమీ లాభం కలిగించ లేదు" అని ఉద్ఘాటించింది.

'వినాయకుడు ఎన్నో రూపాలతో నా దగ్గరే వున్నాడు కదా! నా శక్తికి ఆయనే ప్రత్యక్షసాక్షి' అన్నాడు బుద్ధుడు.

నీ కళ్ళముందే నన్ను ఈ సాగర్‌లోకి తోసేస్తుంటే నువ్వేం చేసావు - నోరు మూసుకు కూర్చున్నావే' అన్నాడు ఖైరతాబాద్ వినాయకుడు - పొడగాటి శరీరం పైకి లేపి.

'కొన్ని దశాబ్దాలుగా గణపతులను చంపిన ఈ సాగర్ హింసా మయం' అన్నాడు బేగం బజారు వినాయకుడు.

'దేవుళ్ళనే చంపిన ఈ సాగర్ మరణ సరస్సు' అన్నాడు సికింద్రా బాద్ లారీ సంఘం వినాయకుడు.

చుట్టూ హింస పెట్టుకుని' రక్తపాత మడుగు మధ్య నిల్చుని 'అహింసో' అని అరుస్తావేమయ్యా!' అని ఓ కప్ప ఎగిరి బుద్ధుడి మొహం మీద ఊసి మళ్ళి సాగర్‌లోకి ఉరికింది.

బుద్ధుడికి తల తిరిగి పోయింది. 'నేనెక్కడున్నాను!' అని కలియ చూశాడు - చుట్టూ ఆత్మహత్యలు చేసుకున్న దెయ్యాలు, పాములు, కప్పలు, శరీరాంగాలు విరిగిన వినాయకులు, విరిగిపోయిన పడవల నావికా భూతాలు - ఈ శవాల రక్తాల నీరుతో ఎర్రగా కనిపిస్తున్న మరణ సరస్సు హుస్సేన్‌సాగర్! వాతావరణ కాలుష్యం పెరిగిపోయింది అని నిట్టూర్పు విడిచాడు బుద్ధుడు.

భూమిమీద ఎక్కడ చూసినా రక్తపాతమే. ఒకరినొకరు చంపుకోవటమే - రాజ్యం కోసం - ధనం కోసం స్త్రీ కోసం - ఆస్తి కోశం - సుఖాల కోసం.

ఇప్పుడు అహింసా సిద్ధాంతం ఎవరికి ఒంట బడుతుంది - అది చెబితే వీరంతా తన్ను వెలేసేవారిలా కనిపించారు.

'డవున్ డవున్ బుద్ధా ? అన్నారు దెయ్యాలు, వినాయకులూ మళ్ళీ'

"నువ్వుకూడా మా వాతావరణంలోకి వచ్చేయి"

'లేకపోతే సమ్మె చేస్తాం'

'దెయ్యాలమైనా మళ్ళీ ఆత్మహత్య చేసుకుంటాం'

'ఆ మరణ నిరాహార దీక్షలు చేస్తాం' రెచ్చిపోయింది గందరగోళం చుట్టూ !

'సరే నా ప్రజల, భక్తుల మాట కాదనగలనా !

'హింసో పరమో ధర్మః' అన్నాడు బుద్ధుడు తన సందేశం మార్చి !

'బుద్ధా జిందాబాద్' అన్నారు అంతా.

ఈ దృశ్యం చూసిన నా మిత్రుడు నిర్ఘాంతపోయాడు.

ఇతను కలికాలం బుద్ధుడు కదా - అనుకున్నాడు.

